


# ఏ వెలుగులకీ ప్రస్థానం

గన్నవరపు నరసింహమూర్తి

ప్రభాతవేళ, మంచు విపరీతంగా కురుస్తుండడంతో దూరంగా ఏదీ కనిపించడంలేదు. రవి కిరణాలు పుడమిని ముద్దాడాలని విశ్వప్రయత్నం చేస్తున్నాయి. ఏపుగా పెరిగిన పొడవైన సిల్వర్ ఓక్ వృక్షాలు, వాటిమధ్య తలలో పాపిడిలా సన్నపాటి దారి, ఎక్కడ చూసినా కొండలే... శేఖరానికి కొండల మధ్య, లోయల్లో ప్రయాణం కొత్తగా వుంది. అతనికి ముందు కొద్ది దూరంలో వడివడిగా నడుస్తూ ప్రకాశం; శేఖరం ఆలోచిస్తున్నాడు – తను చదువు పూర్తయిన తరువాత ఒక ప్రముఖ జాతీయ పక్షపత్రికలో జర్నలిస్టుగా చేరడం, వెనువెంటనే పోలీసులకు, నక్సలైట్లకు మధ్య నలుగుతున్న గిరిజనులపై ఒక పరిశోధనాత్మక వ్యాసం వ్రాయాలని కోరితే పదిహేను రోజులపాటు చింతపల్లి, పాడేరు, అరకు ప్రాంతాల్లో పర్యటించాలని చింతపల్లి వచ్చాడు.

ఈ ప్రాంతాలన్నీ తనకు పూర్తిగా కొత్తయినా అదృష్టవశాత్తు బస్సులో చింతపల్లికి దగ్గర్లోనే పనిచేస్తున్న టీచర్ ప్రకాశంతో పరిచయం కావడం, అతనికి తన పని గురించి చెబితే తనకి ఆతిథ్యం ఇవ్వడమే కాకుండా ఆ చుట్టుపక్కల తండాలన్నీ చూపిస్తానని ముందుకొచ్చాడు. ప్రకాశం ట్రైబల్ తండాలన్నీ చూపిస్తానని ముందుకొచ్చాడు. ప్రకాశం ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లో టీచరుగా పది సంవత్సరాల నుంచి పనిచేస్తుండడంతో ఆ ప్రాంతం అతనికి కొట్టిన పిండి. అందుకే మొదటి రోజు ప్రకాశం పనిచేస్తున్న మర్రిగూడ చూడాలని ఉదయాన్నే బయలుదేరారు.

మర్రిగూడ ఒక చిన్న గిరిజన పల్లె. కొండమీద ఉంది. అది చింతపల్లికి సుమారు పదిహేను కిలోమీటర్ల దూరంలో వుంది. దారి మాత్రం చాలా భయంగా ఉంటుంది. ప్రకాశం వడివడిగానే నడుస్తున్నా శేఖరం మాత్రం ఆపసోపాలు పడుతున్నాడు. కాసేపు ఓ చెట్టుకింద కూర్చుని సేదతీర్చుకుంటూ మాట్లాడుకోసాగారు. ముందు శేఖరమే అడిగాడు –

"ఈ పల్లెలన్నిటికీ సరైన రోడ్లు లేవా? బస్సు సౌకర్యం లేక వీళ్లంద‌రూ ఇలా బాధపడవలసిందేనా?"

"పదేళ్ల క్రితం వరకు ఆర్టీసీ వారు చాలా ఊళ్లకు మెటల్ రోడ్ల మీదే బస్సులు నడిపారు. కానీ ఒకసారి నక్సలైట్లు ఓ బస్సును పేల్చేయడంతో పోలీసులతో సహా నలభై మంది గిరిజనులు చనిపోయారు. అప్పటినుంచి అన్ని బస్సులు చింతపల్లి వరకే. అదికూడా ఉదయం వేళల్లోనే నడుపుతున్నారు."

"ఏమిటో ఈ నక్సలైట్ల ఐడియాలజీ. ఓపక్క గిరిజనుల సంక్షేమం కోసమే పోరాడుతున్నామంటారు. మరోపక్క ఇలాంటి విధ్వంసం. దీనివల్ల ఈ ప్రాంతాలు ఎలా అభివృద్ధి చెందుతాయి?" ఆవేశంగా అడిగాడు శేఖరం.

''అభివృద్ధి అన్నది ఉట్టిదేనండీ; నక్సలైట్లు వాళ్ల ఉనికిని కాపాడుకునేందుకు ఇలాంటి పనులు చేస్తుంటారు. పోలీసులు ఎన్‌కౌంటర్లు చేసి వాళ్ల ఆధిపత్యాన్ని చాటుకుంటుంటారు. మధ్యలో నలిగిపోయేది అమాయకులైన గిరిజనులు, మాలాంటి ఉద్యోగులే'' నిర్లిప్తంగా అన్నాడు ప్రకాశం.

''మరి ప్రభుత్వమేమో ఈ ప్రాంతాల్లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నాం అంటోంది. ఒకసారి అభివృద్ధి జరిగితే నక్సల్స్ సమస్య దానంతట అదే మాయం అవుతుందంటోంది. నిజంగా అటువంటి అభివృద్ధి ఈ ప్రాంతాల్లో జరుగుతున్నదంటారా?'' శేఖరం అడిగాడు.

''ఏం అభివృద్ధండీ! నేను ట్రైబల్ డిపార్ట్‌మెంట్‌లో పది సంవత్సరాల నుంచీ పనిచేస్తున్నాను. అప్పట్లో ప్రభుత్వం అట్టహాసంగా అన్ని గిరిజన గ్రామాల్లో ఏకోపాధ్యాయ పాఠశాలలను ప్రారంభించింది. కానీ నక్సల్స్ సమస్య వల్ల ఏ టీచరూ ఇక్కడ పనిచేయడానికి సుముఖంగా లేకపోవడం వల్ల అవన్నీ మూతపడ్డాయి. ఇప్పుడు ఏడెనిమిది గ్రామాలకు ఒక స్కూలు నడుస్తోంది'' ప్రకాశం చెప్పుకుపోతున్నాడు.

''మరి రహదార్లు, తాగడానికి మంచినీరు, వీళ్లకు వైద్య, ఆరోగ్యాలకు ఏమైనా చేశారా?''

''దేనికైనా నక్సల్స్ సమస్యే అడ్డొస్తోంది సార్. చాలా గ్రామాలకు సడక్ యోజన స్కీము కింద రోడ్లు వేశారు. పల్లెపల్లెకు బస్సు అన్న నినాదంతో బస్సులు నడిపారు. అవన్నీ మూన్నాళ్ల ముచ్చటే అయ్యాయి. ప్రతి తండాలో విరివిగా ఆర్‌డబ్ల్యుఎస్ (రూరల్ వాటర్ సప్లై) స్కీము కింద చాలా బోర్లు వేశారు. అవన్నీ ఇప్పుడు పాడయ్యాయి. వాటిని బాగుచెయ్యాలంటే ఒక్కరూ రారు. ఏమంటే నక్సల్స్ పేరు చెబుతారు. మీరు చెబితే నమ్మరుగానీ ఈ మన్యంలో ఉన్న వందలాది గిరిజన గ్రామాల వారందరికీ కొండగెడ్డలోని మురికి నీరే ఆధారం. ఈ చుట్టుపక్కల ఉన్న పీహెచ్‌సి (ప్రైమరీ హెల్త్ సెంటర్స్)లో ఒక్క డాక్టర్ కూడా లేడు. ఇక వీళ్లకి వైద్యం చేసేదెవరు? ఆరోగ్యం క్షీణించి ప్రతి ఊళ్లో ఎంతోమంది అంటు రోగాలతో వణికిపోతున్నారు'' – ప్రకాశం చెప్పుకుపోతున్నాడు. మరికొద్ది సేపటికి వాళ్లు మర్రిగూడ చేరుకున్నారు.

***

మర్రిగూడలో ఇళ్లన్నీ పూరిపాకలే. అక్కడ స్కూలు బిల్డింగ్ కూడా పెచ్చులూడి, బీటలు వారి శిథిలావస్థలో ఉంది. ప్రకాశాన్ని చూసి ఓ పదిహేనుమంది పిల్లలు స్కూలుకొచ్చారు. వాళ్లని చూడగానే వాళ్లకి సరియైన పౌష్టికాహారం అందటం లేదన్న సంగతి యిట్టే తెలిసిపోతుంది. తైలసంస్కారం లేని జుట్లు, చిరిగిన బట్టలు, చర్మరోగాలతో ఉన్న వాళ్లని చూస్తే శేఖరానికి జాలివేసింది. మధ్యాహ్నం స్కూలు అయిన తరువాత – ''పదండి ఊరు చూద్దాం'' అన్నాడు ప్రకాశం, స్కూలు తలుపులు మూస్తూ.

''చుట్టుపక్కల నాలుగైదు గ్రామాలకు ఈ స్కూలే పనిచేస్తోందన్నారు. పట్టుమని ఇరవైమంది పిల్లలు కూడా లేరేమిటి?'' అన్నాడు శేఖరం.

''ఇంతమందైనా వస్తున్నందుకు సంతోషించండి. అది కూడా మధ్యాహ్నం భోజనం పెడుతున్నామని వస్తున్నారు.''

''కారణం?''

''ఏముందండీ పేదరికం. వీళ్లకి పదిహేనేళ్లు రాగానే కూలిపనికి పంపించేస్తారు. లేకపోతే అడవిలో కర్రలు కొట్టి డబ్బులు సంపాదించాలి. లేకపోతే వీళ్లకి జీవనం సాగదు'' విచారంగా అన్నాడు ప్రకాశం.

ఊళ్లో యిళ్లన్నీ ఒక వరసలో లేవు. అక్కడక్కడ విసిరేసినట్లున్నాయ్. ఇళ్లల్లోని నీరు వీధుల్లోకి వచ్చి మురికిగా తయారైంది. అక్కడే కొందరు ఆడుకుంటున్నారు మామిడి టెంకలతో. ఇద్దరూ కలిసి సర్పంచ్ ఇంటికెళ్లారు. ప్రకాశం శేఖరాన్ని అతనికి పరిచయం చేశాడు.

''ఇతనికి ఇద్దరు కొడుకులుండేవారు. ఒకణ్ణి పోలీసులు ఇంటరాగేషన్ పేరుతో చంపేశారు. రెండోవాడు పోలీసులకు భయపడి నక్సల్స్‌లో చేరిపోయాడు''. ప్రకాశం చెప్పగానే శేఖర్ సర్పంచ్ వంక ఆశ్చర్యంగా చూశాడు.

''అవును దొరా! ఎప్పుడు అన్నలు మా గూడెం వచ్చినా వద్దన్నా మా యింటికొచ్చి ఆళ్లకి కావలసినవి తీసుకెళ్లేవారు. ఈ యిసయం పోలీసోళ్లకి తెలిసి మా పెద్దోణ్ణి తీసికెళ్లారు. మూడు రోజుల తరువాత ఆడి శవాన్ని పంపినారు'' ఏడుస్తూ చెప్పాడతను.

''అవును శేఖరంగారూ! ఈ ప్రాంతంలో నక్సలైట్లు ఓ పోలీస్ వేన్‌ని పేల్చేశారు. దాంతో ఈ చుట్టుపక్కల గ్రామాల్లో వాళ్లకి షెల్టర్ యిచ్చిన వాళ్లందరినీ తీసుకెళ్లారు. పెద్దకొడుకు చనిపోయిన తరువాత రెండోవాణ్ణి కూడా నాలుగైదుసార్లు యింటరాగేషన్ పేరిట తీసుకెళ్తుండడంతో భయపడి అతను నక్సలైట్లలో చేరిపోయాడు'' ప్రకాశం పూర్తిచేశాడు.

''అది సరే! వీళ్లు నక్సలైట్లకు షెల్టర్ ఎందుకిస్తున్నారు?''

''వీళ్లు షెల్టరివ్వడమేమిటి సార్! యివ్వకపోతే అక్కడే కాల్చేస్తారు నక్సల్స్. అదిగో చూడండి ఆ మూడో యిల్లు పోలన్న దొరది. తమ గురించి పోలీసులకు చెప్తాడని అతని కొడుకుని యింటిముందరే కాల్చి చంపేశారు. మీరు చెబితే నమ్మరుగాని యిక్క ప్రతి యింటివాళ్లు అటు నక్సల్స్‌వల్లో, పోలీసుల వల్లో నష్టపోయినవాళ్లే. అందుకే ఊళ్లకు ఊళ్లు ఖాళీ అయిపోతున్నాయి.''

''ఎక్కడెళ్తున్నారు వీరంతా?''


''అరకు, పాడేరు లాంటి టూరిస్ట్ స్పాట్స్‌లో పనిదొరుకుతుందని వెళ్తున్నారు. అక్కడ పొట్టకూటి కోసం వ్యభిచారానికి వీళ్ల ఆడపిల్లలు అలవాటుపడ్డంతో చాలామందికి ఎయిడ్స్ సోకిందని ఈమధ్య ఓ స్వచ్ఛంద సంస్థ సర్వేలో తేలింది.''


''మరి ఈ ఐటిడిఏ (ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఏజన్సీ), దానికో ఐఏఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్. వీళ్లంతా ఏం చేస్తున్నారు. వాళ్లున్నది వీళ్ల అభివృద్ధికోసమే కదా?''

శేఖరం ప్రశ్నకు ప్రకాశం వింతగా చూశాడు.

''వాళ్లు మాత్రం ఏం చేస్తారు సార్! పూర్వం వాళ్లు అన్ని గ్రామాలకూ తిరిగేవారు. ఇప్పుడు అన్నల భయంతో ఎక్కడికెళ్లాలన్నా పూర్తి సెక్యూరిటీతో వెళ్లవలసి వస్తోంది. ఇంక దానివల్ల పనులేం జరుగుతాయి? అభివృద్ధి ఎలా అవుతుంది. ఇప్పుడు ప్రభుత్వానికి వీళ్ల అభివృద్ధికన్నా నక్సల్స్ ఏరివేతే ప్రథమ ఎజెండా అయిపోయింది. అందుకే ఈ ప్రాంతం ఇలా వుంది'' అంటూ చెప్పుకొచ్చాడు ప్రకాశం.

ప్రకాశం మాటలు విన్న తరువాత శేఖర్ అయోమయంలో పడ్డాడు. మరి ఈ నక్సలైట్ల ధ్యేయమేమిటి? ఈ గిరిజనుల ఇబ్బందులన్నిటికీ, ఈ






ప్రాంతం అభివృద్ధి చెందకుండా వుండటానికి వాళ్లే కారణమైతే వాళ్ల పోరాటానికి అర్థంలేదు. ఇది వాళ్లు ఆలోచించాలి. లేకపోతే ఈ ప్రాంతం, ప్రజలు ఎప్పటికీ అభివృద్ధి చెందరు.

అప్పటికే సాయంత్రం అవుతుండడంతో ఇద్దరూ చింతపల్లి బయలుదేరారు. మర్నాటినుంచి శేఖరం రోజూ చింతపల్లి నుంచి తండాలు తిరగడం కష్టం కాబట్టి మర్రిగూడ స్కూలులోనే ఉంటూ అన్ని గ్రామాలను చూస్తాననడంతో ప్రకాశం సరేనన్నాడు. అతనికి తోడుగా పదో తరగతి వరకు చదువుకున్న అసిరిగాణ్ణి ఇచ్చాడు. అసిరిగాడికి ఆ మన్యంలో ప్రతి చెట్టూ, పుట్టా ఎరుకే. అతను చాలా తెలివైనవాడు. కానీ పేదరికంతో చదువుకు స్వస్తిపలికాడు.

ఆరోజు నుంచి అసిరిగాడితో కలిసి శేఖరం రోజూ రెండు మూడు గ్రామాలు చూడటం మొదలుపెట్టాడు. ఆరోజు ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉన్న కొత్తగూడ, జన్నిగూడ గ్రామాలను చూడాలని బయలుదేరారు. ఆ ఊళ్లు రెండూ ఎత్తయిన కొండలమీద ఉన్నాయి. దారి చాలా భయంకరంగా వుంది. ఇంత దుర్గమమైన దారిలో వెళ్లి రావాలంటే చాలా కష్టం. వీళ్లకి ఏమైనా అయితే వైద్యం ఎలా అందుతుందో? మధ్యాహ్నం ఒంటిగంటకు అక్కడకు చేరుకున్నారు. అక్కడ స్కూలు లేదు. తాగడానికి వేసిన బోరు పాడై రెండేళ్లవుతోందని అక్కడి వాళ్లు చెప్పారు. ప్రతి ఇంట్లో ఇద్దరు ముగ్గురు జ్వరాలతో బాధపడుతున్నారు.

"వీళ్ల గురించి ప్రభుత్వం ఏం పట్టించుకోవడం లేదా? ఎవరైనా అధికారులొస్తారంటారా యిక్కడికి'' అసిరిగాణ్ణి అడిగాడు శేఖరం.

ఈ రెండు ఊళ్లూ ఎవరూ రారు సార్! ఈ ఊరుకి అన్నలు వస్తూపోతూ వుంటారు. ఓసారి ఇక్కడ ఎన్‌కౌంటర్ జరిగి ఆరుగురు పోలీసులు చనిపోయారు. ఆ తరువాత స్కూలుని మూసేశారు. నక్సల్స్‌కి సహాయం చేశారని పోలీసులు ఈ ఊరిలోని పదిమంది కుర్రాళ్లని అరెస్టుచేసి తీసుకెళ్లారు. వాళ్లు ఇప్పటికీ జైల్లో మగ్గుతున్నారు. ఏదైనా వీళ్లకి కావాలంటే ఇక్కడికి ముప్పై కిలోమీటర్ల దూరంలోని వారపు సంతకెళ్లాలి. మంచినీటికి ఆ కొండగెడ్డే ఆధారం. ఇక్కడ నాటుసారా పిల్లలు కూడా తాగుతారు దొరా! ఈ రెండు నెలల్లో పదిహేనుమంది విషపు జ్వరంతో బాధపడి చనిపోయారు. కానీ వీళ్లు చిల్లంగి వల్ల చనిపోయారని మంత్రగాళ్లని ఆశ్రయిస్తారు తప్ప వైద్యం చేయించుకోరు. ఆ అవకాశం కూడా లేదు'' అసిరిగాడు చెప్పుకుపోతున్నాడు.

అక్కడినుంచి జన్నిగూడ బయలుదేరారు. అది దీనికన్నా ఎత్తులో ఉంది. దారిలో నలుగురు మనుషులు ఒక మంచాన్ని మోసుకుంటూ కిందకు దిగడం కనిపించింది. ఆ మంచంమీద ఒక వ్యక్తి అచేతనంగా పడివున్నాడు.

"అతను నాకు తెలిసినవాడే దొరా! నెలరోజుల నుంచీ జ్వరంతో బాధపడుతుంటే నాటువైద్యం చేయించారు. అది పనిచేయకపోవడంతో యిప్పుడు చింతపల్లికి తీసుకెళ్తున్నారు. ఆడు బ్రతకడం కష్టం'' వేదాంతిలా చెప్పాడు అసిరిగాడు. శేఖరానికి కళ్లు నీళ్ల పర్యంతం అయ్యాయి.

తిరుగు ప్రయాణంలో మూలుగూడ జంక్షన్‌కొచ్చారు. అక్కడ ఏదో పెద్ద బహిరంగ సభ జరగబోతోంది. చాలామంది జనం మూగి ఉన్నారు. ఎక్కడ చూసినా "మేధాపాట్కర్‌కి స్వాగతం'' అన్న హోర్డింగులు, ఏ ఇంటి గోడపై చూసినా "ఇక్కడి బాక్సైట్‌ని తవ్వొద్దు. మా బ్రతుకులను సమాధా చెయ్యొద్దు'' అన్న నినాదాలు వ్రాసి ఉన్నాయి.

"ఇక్కడ బాక్సైట్ తవ్వితే మీకెందుకు అభ్యంతరం అసిరయ్యా! దాంతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది కదా?'' శేఖరం అసిరయ్యతో అన్నాడు.

"తవ్వొద్దు అని మేం అనటంలేదు దొరా! కొన్ని పార్టీలవాళ్లు అంటున్నారు. దాన్ని తవ్వితే అన్ని ప్రాంతాలకు రోడ్లు వేస్తారు. అది కొందరికి యిష్టంలేదు. చాలామందికి మేమందరం ఎప్పటికీ యిలాగే వుండాలనే కోరిక. ఈ ప్రాంతం అభివృద్ధి చెందితే తమ ఉనికికే ప్రమాదం అని మరి కొందరి ఆలోచన. అందుకే ఈ సభలూ, ఆందోళనలూ. మధ్యలో మమ్మల్నెవరూ అడగరు'' నిరాశగా చెప్పాడు అసిరయ్య.

'ఈ పార్టీలన్నీ ప్రజలని తప్పుదోవ పట్టిస్తున్నాయ్. బాక్సైట్ ఖనిజాన్ని తవ్వితే నదులు కాలుష్యం అవుతాయనీ, గిరిజన జాతి అంతరించిపోయే ప్రమాదం పొంచివుందని తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నాయి. వీళ్లకి గిరిజనాభివృద్ధి మీద చిత్తశుద్ధి వుంటే యిటువంటి వాటిని అడ్డుకోరు. కానీ ఎవరు వింటారు ఈ ఘోషని' స్వగతంగా అనుకున్నాడు శేఖర్.

***

శేఖరం వచ్చి అప్పుడే ఇరవై రోజులయింది. పదిహేను రోజుల్లో పని పూర్తిచెయ్యాలనుకున్నా తిరగవలసిన ప్రదేశాలు, ఊళ్లు ఎన్నో ఉండడంతో అది పొడిగించబడింది. ఎంతో ఉత్సాహంతో అన్ని పల్లెలు తిరిగాడు శేఖరం. వాళ్ల సమస్యల్ని, వాళ్లు పడుతున్న బాధల్ని కళ్లారా చూశాడు. మర్నాడు తాను వెళ్లిపోతానని ప్రకాశానికి చెప్పాడు శేఖరం. ఈ ఇరవై రోజులు తనకెంతో సహాయం చేసిన మర్రిగూడ ప్రజలకి కృతజ్ఞతలు చెప్పడానికి ప్రకాశంతో కలిసి ఊళ్లోకి వెళ్లాడు శేఖరం. వాళ్లు ప్రభుత్వాన్నుంచి ఏం కావాలని కోరుకుంటున్నారని చాలామందిని అడిగాడు శేఖరం. అందరూ చెప్పేది ఒకటే మాట – "మా గ్రామాలకి అటు పోలీసోళ్లు గానీ, అన్నలుగానీ ఎవ్వరూ రావద్దు. మా మానాన మమ్మల్ని వదిలేస్తే మా బతుకులు మేం బతుకుతాం''. సూటిగా చెప్పిన వాళ్ల మాటలు శేఖరంలో కొత్త ఆలోచనలు రేపాయి.

శేఖరం చింతపల్లి చేరేసరికి మధ్యాహ్నం ఒంటిగంటైంది. బస్టాండ్ దగ్గర భోజనం చేసి వస్తుండగా అక్కడికి దగ్గరలోనే ఎన్‌కౌంటర్ జరిగిందనీ, పదిమంది నక్సలైట్లు చనిపోయారన్న వార్త గుప్పుమంది. శేఖరం జర్నలిస్టులకున్న ఉత్సాహంతో ఆ ప్రదేశానికి వెంటనే బయలుదేరి వెళ్లాడు. ఆ ప్రాంతం దట్టమైన అటవీ ప్రాంతంలో వుంది. అక్కడికెళ్లడానికి రెండు గంటలకు పైగా పట్టింది. ఆ ప్రాంతం అంతా పోలీసులతో నిండి వుంది. ఇంకా పోలీసు జీపులు వస్తూనే వున్నాయి. శేఖర్ తాను పత్రికా విలేకరినని చెప్పడంతో పోలీసులు అతనికి అడ్డుచెప్పలేదు. ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన వాళ్లను తెల్లని గుడ్డలతో కప్పి ఉంచారు. వాళ్ల దగ్గర దొరికిన ఆయుధాలను అక్కడే పోగుచేసి ఉంచారు. అక్కడ స్మశాన వాతావరణం నెలకొని ఉంది. కొంచెం సేపటికి తేరుకొని శేఖరం దగ్గర్లోనే ఉన్న డిఎస్పీని కలిసి తన పరిచయం చెప్పి ఎన్‌కౌంటర్ వివరాలు అడిగాడు. అతను కొంచెం అసహనానికి గురయ్యాడు. అప్పుడు చెప్పాడు –

వాళ్లది చింతపల్లి దళం. వీళ్లే మా పోలీసు జీపుని

ఇరవై రోజుల కిందట ఇక్కడికి దగ్గర్లోనే పేల్చేశారు. అప్పుడు మావాళ్లు ఎనిమిది మంది చనిపోయారు. అప్పటినుంచీ వీళ్లకోసం గాలిస్తున్నాం. ఇవాళ్టికి దొరికారు'' చాలా ఆవేశంగా చెప్పుకుపోతున్నాడ తను. మధ్యలో శేఖరం అడిగాడు.

''సార్! మిమ్మల్ని నక్సలైట్లు, వాళ్లనీ మీరు చంపుకుంటూ పోతుంటే దీనికి అంతెక్కడ? దీనికి ముగింపు ఉండదా?''

''ఇది మా చేతుల్లో లేదండి! ఒక ప్రభుత్వం నక్స ల్స్‌ని ఏరివేయాలంటారు. యింకో ప్రభుత్వం వచ్చి వాళ్లు మాకు శత్రువులు కారు అని చర్చలు జరుపు తారు. అసలు ఈ నక్సల్స్‌కి ఏం కావాలో, ఏం సాధి ద్దామనుకుంటున్నారో ఎవరికీ అర్థంకాదు. ఈ పోరాటంలో కొన్ని వేలమంది మా పోలీసు సోద రులు ప్రాణాలు పోగొట్టుకున్నారు. వాళ్లూ చనిపో తున్నారు. ఒక్కొక్కసారి అనిపిస్తుంటుంది – ఈ ఉద్యోగాన్ని వదిలి ఏ లైబ్రరీలోనో ప్రశాంతంగా గడి పెయ్యాలని. రేపటినుంచీ మీ పత్రికల వాళ్లకి పెద్ద మసాలా... అందరూ మామీదే దాడి చేస్తారు. ఈ అడవుల్లో మేం యిన్ని కష్టాలు పడుతుంటే సాను భూతన్నది లేకపోగా సస్పెన్షన్స్... ట్రాన్స్‌ఫర్స్...'' అతని మాటలు శేఖరానికి నిజమేననిపించాయి.

అక్కడనుంచి ఆ శవాల దగ్గరకొచ్చాడు. అక్కడ ఒక ముసలాయన ఏడుస్తూ కనిపించాడు. అతనికి తనని పరిచయం చేసుకున్న తరువాత అతని వివ రాలు అడిగాడు. కొద్దిసేపు పౌనం వహించి తరు వాత చెప్పడం మొదలెట్టాడు. తాను పదవీ విర మణ చేసిన ఉపాధ్యాయుడినని, ఇప్పుడు చనిపో యిన నక్సల్స్‌లో సాయన్న తన శిష్యుడనీ, చిన్నప్ప టినుంచీ తన దగ్గరే చదువుకున్నాడనీ, కబురు తెలిసీ శవాన్ని తీసుకెళ్లడానికి వచ్చానని చెప్పాడ తను.

''మీ శిష్యుడు సాయన్న ఎన్నాళ్ల క్రితం నక్సలై ట్లలో చేరాడు మాస్టారూ? చేరడానికి గల కారణాలే మిటో?'' ఆసక్తిగా అడిగాడు శేఖరం.

''నా శిష్యుడు సాయన్నది పేద కుటుంబం. చిన్నప్పుడే తల్లీతండ్రీ చనిపోవడంతో నేనే చేరదీసి, నా స్కూల్లోనే చదివించాను. మా ఇంట్లోనే మా పిల్లలతోనే ఉండేవాడు. ఇంటర్మీడియట్ పూర్తయిన తరువాత డిగ్రీ చదువుకునేందుకు పట్నం వెళ్లాడు. ఆ తరువాత కొన్నాళ్లకు ఎవరికీ కనిపించకుండా ఎక్కడికో వెళ్లిపోయాడు. ఇతన్ని చూసి పదేళ్లకి పైగా అయింది. అతను ఈ ఉద్యమంలో ఎందుకు చేరిపోయాడో యిప్పుడే అతను నాకు రాసిన ఉత్తరం చదివితే తెలిసింది. ఈ ఉత్తరం చూసే పోలీ సులు నన్ను పిలిపించారు'' అంటూ ఓ ఉత్తరాన్ని శేఖరం చేతికిచ్చాడు. శేఖరం దాన్ని చదవడం మొద లుపెట్టాడు. అందులో యిలా వుంది.

ప్రియమైన మాస్టారుకి,

సాయన్న వ్రాయునది. మీరు నన్ను ఎంతో ఆద రించి చదివించారు. నేను తెలివైనవాణ్ణని, నేనెంతో వృద్ధిలోకి వస్తానని నా మీద ఎంతో నమ్మకంతో మీ ఇంట్లో ఉంచుకొని మీరు చదివిస్తే నేను మీ నమ్మ కాన్ని వమ్ముచేశాను. నేను ఉద్యమంలో చేరడానికి గల కారణాలు, దీని ద్వారా ఏం సాధించిందీ మీకు తెలియాలనే ఈ నా జీవిత చివరి క్షణాల్లో ఈ ఉత్తరం రాస్తున్నాను. మాస్టారూ! పోలీసులు మేమున్న కొండను చుట్టుముట్టారు. యింక కొద్ది క్షణాల్లో మేం చనిపోవడం ఖాయం.

నేను కాలేజీలో చదువుతుండగా మా స్నేహి తుడు రాజయ్యతో కలిసి అతని ఊరికి వెళ్లడం జరి గింది. అతనికి చింతపల్లికి దగ్గరల్లోనే ఒక చిన్న గిరి జనపల్లె. అతని తండ్రి ఓ పేద గిరిజనుడు. అతనికి కొంతమొత్తం అప్పిచ్చిన దళారీ, అతను పండించిన పంటనంతా తనే తీసుకునేవాడు. మూడో సంవ త్సరం అతను యివ్వననడంతో పోలీసులను తెచ్చి అతన్ని అరెస్టు చేయించాడు. నేను ఊళ్లోకి వెళ్లేసరికి అదీ పరిస్థితి. అది తెలిసి నేను, నా స్నేహితుడు పోలీసు స్టేషన్‌కెళ్లాం. ఆ దళారీ దగ్గర డబ్బులు తీసుకున్న పోలీసులు అతన్ని చిత్రహింసలు పెట్ట డంతో అదేరోజు రాత్రి చనిపోయాడు. అదేమని మేమడిగితే మమ్మల్ని అరెస్టు చేసి జైల్లో పెట్టారు.

మాస్టారూ! ఈ మన్యాన్ని దళారీలు, పోలీసులు దోచుకుంటున్నారు. ఎవరైనా ఎదిరిస్తే వాళ్ల పని సరి. ఇక్కడంతా ఆటవిక రాజ్యం. ప్రభుత్వం చెబు తున్న అభివృద్ధి అంతా నిజంగా బూటకం. పనులు చేసే కంట్రాక్టర్లు అక్రమంగా పనులు చేయకుండా దోచుకుంటున్నారు. ఏదైనా అడిగితే నక్సలైట్ల పేరు చెబుతుంటారు.

వారం రోజుల తరువాత మమ్మల్ని విడుదల చేశారు. తిరిగొచ్చిన తరువాత ఈ అన్యాయాన్ని ఎదిరించాలని కొద్దిమంది యువకులతో కలిసి నక్స ల్స్‌ని కలిశాము. ఆ రాత్రే మమ్మల్ని లాకప్‌లో పెట్టిన పోలీసు స్టేషన్‌ని పేల్చేశాం. అక్కడున్న నలుగురు పోలీసుల్ని చంపేసి, అక్కడున్న ఆయ ధాల్ని మాతో పట్టుకెళ్లాం. ఆ దళారీని వాడింట్లోనే చంపేశాం. అప్పటినుంచీ నాది రహస్య జీవితం అయింది. ఎన్నో ఎన్‌కౌంటర్లు. మమ్మల్ని పోలీ సులు, వాళ్లని మేము విచక్షణారహితంగా చంపు కుంటున్నాం. ఈ నరమేధం యింకెన్నాళ్లో ఎవరికీ తెలియదు. ఎన్నోమార్లు మిమ్మల్ని కలవాలని ప్రయత్నించాను. కానీ కుదరలేదు. ఇన్నాళ్ల తర వాత ఈ మధ్యనే నాలో అంతర్మథనం మొదలైంది. ఎన్నాళ్లీ చీకటి బ్రతుకు? ఎలా బయటపడటం? ఈ పద్మవ్యూహంలో ఒకసారి చిక్కుకుంటే బయటప డడం అసాధ్యం. శలభాల్లా మాడి మసైపోవల సిందే.

కానీ ఒక్కటి మాత్రం నిజం మాస్టారూ! ఈ అమాయక గిరిజన ప్రజలను దళారీల దోపిడీ నుంచి ఆదుకోవాలి. వాళ్లు మనుషుల్లా బతకడం లేదు. జంతువులకన్నా హీనంగా జీవితాన్ని గడుతు న్నారు. పోలీసులు వీళ్లని హింసిస్తూ మానవ హక్కుల్ని కాలరాస్తున్నారు.

ఏదైనా నా పోరాటం అసంపూర్తిగా ముగియ బోతోంది. మా ఉద్యమాన్ని వీళ్లు అరికట్టవచ్చు. కానీ ఈ ప్రజలకు వీళ్లేం చేస్తున్నారో అందరూ ఆలో చించాలి. ఈ చివరి క్షణాల్లో నాలోని బాధని మీతో పంచుకోవాలనే ఈ ఉత్తరం రాస్తున్నాను. ఏదైనా మీ నమ్మకాన్ని వమ్ము చేసినందుకు క్షమాపణలు కోరుకుంటూ....

మీ

**సాయన్న**

సుదీర్ఘమైన ఆ ఉత్తరాన్ని చదివిన శేఖరానికి మనసు భారమైంది. ఈ పోలీసులు గాని, నక్స లైట్లు గాని ఏం సాధిస్తున్నారు? దేనికోసం యిదంతా. అతనికి ఎందుకో శ్రీశ్రీ మహాప్రస్థానం గుర్తుకొచ్చింది. ఈ పేద గిరిజనులను ఆదుకోవడా నికి ఆ జగన్నాథ రథచక్రాలు ఎప్పుడొస్తాయో? ఈ ఎన్‌కౌంటర్లు, ఈ మారణహోమాలు ఎవరి అభివృ ద్ధికోసం. ఈ నెత్తుటి హోమానికి ముగింపెప్పుడో?

దేనికోసం యిదంతా? ఏ వెలుగులకీ ప్రస్థానం? శేఖరం ఆలోచిస్తూ వెనుదిరిగిపోయాడు.

★






51